సీసీఎస్‌లో ఏహెచ్‌టీయూ కార్యాలయం ప్రారంభం



ఏహెచ్‌టీయూ, జేబీ కార్యాలయాలను ప్రారంభిస్తున్న సిటీ సీపీ సీవీ ఆనంద్,

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ మేరకు సిటీ కమిషనరేట్ పరిధిలోని పాత సీసీఎస్ (సెంట్రల్ జోన్ ఉమెన్ పీఎస్ ప్రాంగణం)లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ), జువెనైల్ బ్యూరో కార్యాలయాలను మంగళవారం సీపీ ప్రారంభించారు. వాటితో పాటు.. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థతో కలిసి బాధితుల కోసం ప్రత్యేక సహాయ విభాగాన్ని సీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ అండ్ సిట్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ సునీత, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ సునీతాకృష్ణన్ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌ను త్వరగా గుర్తిస్తే నయం చేయొచ్చు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న క్యాన్సర్ విజేతలు, వారి సంరక్షకులు, వైద్య నిపుణులు, ఆస్పత్రి సిబ్బంది

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను త్వరగా నయం చేయడానికి ఆధునిక చికిత్సలు, ప్రక్రియలు, మందులు అందుబాటులో ఉన్నాయని, త్వరగా వ్యాధిని గుర్తిస్తే నయం చేయవచ్చునని మెడికవర్ ఆస్పత్రి అంకాలజిస్టులు పేర్కొన్నారు. మంగళవారం మాదాపూర్‌లోని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో 'క్యాన్సర్ సర్వైవర్స్ మంత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 'సెలబ్రేటింగ్ ది సూపర్ హీరోస్' అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమంలో క్యాన్సర్ విజేతలు, వారి సంరక్షకులు, వైద్యనిపుణులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. క్యాన్సర్‌ను జయించిన వారి స్ఫూర్తిని, ధైర్యాన్ని పెంపొందించి, మిగతా వారిలో మనోనిబ్బరాన్ని కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రవీణ్ క్యాన్సర్ చికిత్సలో ఎదురయ్యే సవాళ్లను వివరించారు. చిన్నపిల్లల కోసం సరికొత్త రేడియేషన్ పద్ధతుల పురోగతులను రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ ప్రశాంత్ విశదీకరించారు. రోబోటిక్ సర్జరీల ప్రయోజనాలను సర్జికల్ అంకాలజిస్టు, రోబోటిక్ సర్జన్ డాక్టర్ రవి చందర్ వివరించారు. ఈ పద్ధతుల వల్ల మెరుగైన ఫలితాలు, త్వరితగతిన కోలుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విజేత 2025 మిథాలీ అగర్వాల్, క్యాన్సర్ సర్వైవర్స్ సుమతి చూరుకంటి పాల్గొని తమ అనుభవాలను వివరించారు.

65ఏళ్ల వృద్ధురాలికి అరుదైన చికిత్స

- 'వాచ్‌మన్' పరికరంతో వైద్యం



వైద్య ప్రక్రియలో పాల్గొన్న గ్లెనీగల్స్ ఆస్పత్రి వైద్య బృందం

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రక్తనాళాలు మూసుకుపోయి పక్షవాతం బారినపడిన ఓ వృద్ధురాలికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే లక్డీకాపూల్‌లోని గ్లెనీగల్స్ ఆస్పత్రి వైద్య బృందం 'వాచ్‌మన్' పరికరం ద్వారా లెఫ్ట్ ఎట్రియల్ అపెండేజ్ క్లోజర్ వైద్య ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గ్లెనీగల్స్ ఆస్పత్రి డాక్టర్ ఎం.సాయి మాట్లాడారు. నగరానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలికి కర్ణిక దడ వల్ల గుండె ఎడమ కర్ణిక అపెండేజ్‌లో రక్తం గడ్డకట్టి పక్షవాతంతో ఇబ్బంది పడుతుందని తెలిపారు. స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించే ప్రత్యామ్నాయంగా కార్డియాలజీ బృందం 'వాచ్‌మన్' పరికరం ద్వారా సమస్యను సరిచేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఒక గంటలోపు పూర్తైందని, రోగి పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం పట్టిందని తెలిపారు. వాచ్‌మన్ పరికరం చిన్న పరాచూట్ ఆకారంలో ఉండే ఇంప్లాంట్ అని, ఇది కర్ణిక దడ ఉన్న రోగుల్లో ఎక్కువగా రక్తం గడ్డ కట్టే గుండె ఎడమ కర్ణిక అపెండేజ్‌ను మూసివేసే విధంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. ఈ సర్జరీ చేసిన వైద్యులను ఆస్పత్రి సీఓఓ మిస్టర్ మాధ్వి ఖురానా అభినందించారు.

జనగణనలో కులగణన చేపట్టకుంటే యుద్ధమే : వీహెచ్

హైదరాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జనగణనలో భాగంగా కులగణనను కేంద్ర ప్రభుత్వం చేపట్టకుంటే రోడ్లపైకి వచ్చి యుద్ధం చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు హెచ్చరించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగణన అంటున్న కేంద్రం.. అందులో కులగణన ప్రస్తావన ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. అగ్రకులాలకు చెందిన రాహుల్, రేవంత్‌రెడ్డి బీసీల కోసం ఆలోచన చేస్తుంటే.. బీసీని అని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ మాత్రం బీసీల గురించి ఆలోచించట్లేదన్నారు. జనగణన వల్ల బీజేపీకి లాభం తప్ప.. బీసీలకు లాభం లేదన్నారు.

ఓయూలో ఆర్.నారాయణ మూర్తి



ఆర్.నారాయణ మూర్తితో విద్యార్థి సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి తన సినిమా 'యూనివర్సిటీ' ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లారు. ఓయూలోని వామపక్ష, దళిత విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'హామీలను నెరవేర్చిన తర్వాతే ఆటో పర్మిట్ జీవోను అమలు చేయాలి'

నల్లకుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే ఆటో పర్మిట్ జీవోను అమలు చేయాలని తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ నేతలు సూచించారు. ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోలు పాత ఆటో పర్మిట్ల స్థానంలోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ రవిశంకర్ అల్లూరి మాట్లాడారు. బీఆర్ఎస్, వామపక్ష, ఏఐటీయూసీ అనుబంధ ఆటోడ్రైవర్ల సంఘం నేతలు ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందం చేసుకుని కొత్త ఆటో పర్మిట్లను తీసుకువచ్చి ఆటోడ్రైవర్లను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ నాయకులు రవికుమార్, కొమరయ్య, రవి, హబీబ్, ఈశ్వర్, సాయిలు, శ్రీధర్‌రెడ్డి, సమ్మయ్య, పెంటయ్యగౌడ్, వజ్రలింగం తదితరులు పాల్గొన్నారు.

చెత్త, మట్టి తొలగింపు కోసం స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రాంనగర్‌లో చెత్త, మట్టి తొలగింపును పరిశీలిస్తున్న డీఎంసీ రామానుజులరెడ్డి, కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో చెత్త, మట్టి తొలగింపు కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి తెలిపారు. మంగళవారం రాంనగర్ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి, శ్రీరామ్‌నగర్, మూన్ కేఫ్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి డీఎంసీ రామానుజులరెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ చెత్త, మట్టి తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంసీ మాట్లాడుతూ వర్షాకాలంలో ఎలాంటి అనారోగ్యాలూ తలెత్తకుండా మట్టి, చెత్తను తొలగిస్తున్నామన్నారు. కార్పొరేటర్ రవిచారి మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని బస్తీలు, కాలనీల్లో చెత్త, మట్టికుప్పలను వెంటనే తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, బీజేపీ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ టీమ్‌లను ఏర్పాటు చేయాలి



కచ్చానాలా పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా ఎమర్జెన్సీ టీమ్‌లను ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. డివిజన్‌లోని టీఆర్‌టీ క్వార్టర్స్ మెయిన్‌రోడ్, జవహర్‌నగర్ స్కూల్ వద్ద జరుగుతున్న కచ్చానాలా పైప్‌లైన్ పనులను మంగళవారం ఆమె జీహెచ్‌ఎంసీ డీఈ గీత, ఏఈ అబ్దుల్‌సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి పర్యవేక్షించారు. అశోక్‌నగర్ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్ వెళ్లే ప్రధానరహదారి కావడంతో ప్రయాణికుల రాకపోకలకు ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులవల్ల తీవ్ర ఆటంకం కలుగుతోందని స్థానికుల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. కాబట్టి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, ఎం.ఉమేష్, సత్తిరెడ్డి, ప్రకాష్‌యాదవ్, శివకుమార్, శ్రీనివాస్, నర్సింహ, ఆనంద్‌రావు, సురేష్, మహమూద్, భారత్, ధనరాజ్, నీరజ్, సంయుక్తరాణి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ దిశగా మోదీ పాలన



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ వనం రమేష్ తదితరులు

నల్లకుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల నిర్విరామ కృషి, అంకితభావం పట్టుదలతో ప్రధాని మోదీ నేతృత్వంలో వికసిత్ భారత్ దిశగా ముందడుగు వేస్తుందని బీజేపీ నేతలు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని వారు బీజేపీ శ్రేణులకు సూచించారు. మంగళవారం నల్లకుంట డివిజన్‌లోని ఖార్థానా వీధిలో ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో భాగంగా బీజేపీ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు హాజరై మాట్లాడుతూ భారతదేశాన్ని నేడు అవినీతిరహితంగా మార్చిన ఘనత మోదీదేనన్నారు. ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అంతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.లక్ష్మణ్‌కుమార్, ఎం.మధుసూదన్‌యాదవ్, ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్, ప్రశాంత్ జోషి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సన్మానిస్తున్న ప్రధాన కార్యదర్శి డాక్టర్ లయన్ వెంకటగోవింద్‌రావు తదితరులు

కవాడిగూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ నేతలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన సమయంలో గుర్తింపు వస్తుందని ఆయన సూచించారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శిగా నియమితులైన డాక్టర్ లయన్ వెంకటగోవింద్‌రావు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శాలువా కప్పి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకట గోవిందరావు మాట్లాడుతూ, టీపీసీసీ ప్రధానకార్యదర్శి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ నాయకులు మచ్చ విజయ్‌కుమార్, ముంజగల్ల విజయ్‌కుమార్, పి.పురుషోత్తంరెడ్డి, కె.నాగరాజు, ఎ.రాఘవేందర్, జి.ప్రవీణ్‌కుమార్, షేక్‌అఖిల్ పాల్గొన్నారు.

రోడ్లపై వర్షంనీరు నిలువకుండా చర్యలు



నింబోలిఅడ్డ వద్ద రోడ్డుపై వర్షంనీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో రోడ్లపై వర్షంనీరు నిలువకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని నింబోలిఅడ్డ శ్రీఅమ్మవారి ఆలయం వద్ద మురికినీరు నిలిచి దుర్గంధం వస్తోంది. దీంతో స్థానిక ప్రజల ఫిర్యాదుతో ఆ ప్రాంతాన్ని సందర్శించారు. జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్‌కు ఫోన్ చేసి వెంటనే రోడ్డుపై నిలిచిన మురికినీరును తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన ప్రాంతాల్లో రెయిన్ వాటర్ పైప్‌లైన్‌లు నిర్మించడానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు శ్రీధర్, బాబన్న, నరేష్, భీమ్‌రాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో సైతం బీఆర్ఎస్‌కు అత్యంత ఆదరణ

చిక్కడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లోని తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ పట్ల అత్యంత ఆసక్తి ప్రదర్శిస్తున్నారని ఆ పార్టీ యువ నేత ముఠా జైసింహ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు అమెరికాలో ఘనంగా నిర్వహించిన నేపథ్యంలో అక్కడి బీఆర్ఎస్ నేతల ఆహ్వానం మేరకు యూఎస్ వెళ్లి తిరిగొచ్చిన జైసింహను పార్టీ సీనియర్‌నేత, గాంధీనగర్ డివిజన్ మాజీ ప్రధానకార్యదర్శి పాశం రవి మంగళవారం జవహర్‌నగర్‌లో ఘనంగా సన్మానించారు.

'బ్రాహ్మణ' పాలకవర్గాన్ని నియమించాలి

చిక్కడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పాలకవర్గాన్ని వెంటనే నియమించాలని, పరిషత్ పాలకమండలిలో శ్రీవైష్ణవులకు 50 శాతం డైరెక్టర్ పదవులు కేటాయించాలని తెలంగాణ శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర శాఖ ఆవిర్భావసభ సమావేశం డిమాండ్ చేసింది. సంఘం ఆవిర్భావ సమావేశం నగరంలో సోమవారం జరిగింది. మంగళవారం సమావేశ వివరాలను జేఏసీ కన్వీనర్ పీచర కృష్ణ, తెలంగాణ శ్రీవైష్ణవ సంఘం కన్వీనర్ డింగరి రవి ఒక ప్రకటనలో విడుదల చేశారు.

బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ కార్యదర్శిగా పృథ్వి



ముషీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ కార్యదర్శిగా పార్టీ యువ నాయకుడు సి.పృథ్వీ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్ ప్రకటించారు. మంగళవారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని అన్నారు.

అరుంధతీనగర్‌లో పారిశుధ్య పనుల నిర్వహణ

చిక్కడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అరుంధతీనగర్ బస్తీలో పేరుకుపోయిన బురద, మట్టిని మంగళవారం తొలగించారు. ఇటీవలి వర్షాలకు బస్తీలో బురద, మట్టి చేరి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో పనులు నిర్వహింపచేసినట్లు బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్ వివరించారు. బస్తీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రయివేట్ వ్యక్తులతో పనులు చేయించినట్లు ఆయన వివరించారు.

ఆర్టీసీ బస్ భవన్ వద్ద ఏబీవీపీ ధర్నా



బస్‌పాస్ చార్జీలను నిరసిస్తూ ఆర్టీసీ బస్ భవన్ వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పెంచిన ఆర్టీస్ బస్‌పాస్ చార్జీలను నిరసిస్తూ మంగళవారం ఆర్టీసీ బస్ భవన్ వద్ద ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు బస్‌భవన్‌ను ముట్టడించడానికి తరలివచ్చారు. దీంతో ఈ ప్రాంతంలో కొద్ది సేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులకు ఏబీవీపీ విద్యార్థుల మధ్య వాగ్వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఏబీవీపీ సెంట్రల్ కమిటీ సభ్యురాలు ఝాన్సీ, నాయకులు పృథ్వీతేజ్, రాజు, హర్ష, ప్రసాద్, కల్యాణి, శ్రీరామ్ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి నగరంలోని పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు.

మినీలారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన మినీలారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో కాచిగూడ కుమార్ థియేటర్ ఎదురుగా 50 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. అతన్ని చాదర్‌ఘాట్ నుంచి వేగంగా వచ్చిన మినీలారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మినీలారీని స్వాధీనం చేసుకుని లారీ డ్రైవర్ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సునీల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సరళమైన తెలుగులో గోన బుద్ధారెడ్డి రచనలు



మాట్లాడుతున్న మధుసూదనాచారి, పక్కన జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గోన బుద్ధారెడ్డి సరళమైన తెలుగులో రాసిన ఉడతసాయం, సీతాన్వేషణం ఒకనాడు పాఠాలుగా ఉండేవని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు కవి, రంగనాథ రామాయణం గ్రంథాన్ని రచించిన గోన బుద్ధారెడ్డి యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ బుద్ధారెడ్డి 13వ శతాబ్దివారు అని కాకతీయ ప్రభువులకు సామంతరాజుగా రాయచూర్‌ను పాలించారన్నారు. ప్రముఖ సాహితీవేత్త డా.జయరాములు మాట్లాడుతూ ఆంధ్రమహాభారత రచన చేసిన తిక్కన సమకాలీకుడు బుద్ధారెడ్డి అని తెలిపారు. రాణి రుద్రమదేవి సమకాలికుడు అయిన గోనగన్నారెడ్డి కుమారుడు బుద్ధారెడ్డి అని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని మంగళవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీసంగీత విభావరి ఆకట్టుకుంది. జగదానంద కారక జయ జానకీ ప్రాణ నాయకా శీర్షికతో నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీగాయకులు గోవిందరావు, చంద్రతేజ, శైలజ, శ్రీనివాస్, సంధ్యారాణి, లలితారావు, టీవీరావు, వాణి, వర్ధని, రామకృష్ణ, రవిమన్యు, సుబ్రహ్మణ్యం, పీఎన్‌కే రావు తదితరులు గీతాలు ఆలపించారు. కాగా గోవింద్ మల్టీ టాలెంట్ ఆర్ట్స్ గౌరవాధ్యక్షులు, గాయకులు వీఎస్ సుందరరావును సన్మానించారు.

ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో యోగా శిక్షకురాలు శారద ఆధ్వర్యంలో కార్యకర్తలతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్, యోగా ప్రతినిధులు కె.రాజకుమార్, జి.జనార్ధన్‌రెడ్డి, కార్యక్రమ అభియాన్ కన్వీనర్ వంశీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బడి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యానగర్‌లోని ఎస్‌వీఈఎస్ పాఠశాలలో విద్యార్థులకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నోట్ బుక్స్, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, పద్మ, రమేష్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, అబ్బు, అనురాధ, ప్రియాంక, విక్కీ, హరీష్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో జారీ చేయాలి

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బీసీ 42 శాతం రిజర్వేషన్ల జీవో జారీ చేయకుండా ఎన్నికలకు వెళ్తే రాష్ట్రం రణరంగంగా మారుస్తామని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం కాచిగూడలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్నారని రకరకాల ప్రకటనలు చేస్తున్నారని, వీరు ఏమైనా ఎన్నికల కమిషనర్లా అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంఘాలు, అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి న్యాయ నిపుణులతో చర్చించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టు శ్రీనివాస్ కుటుంబానికి పరామర్శ

నల్లకుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇటీవల మరణించిన సీనియర్ జర్నలిస్టు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్‌సొసైటీ సభ్యులు పెంటూకర్ శ్రీనివాస్ కుటుంబాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు బండి విజయ్‌కుమార్, పిల్లి రాంచందర్, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. నగరంలోని వారి ఇంటికెళ్లి దివంగత శ్రీనివాస్ సతీమణి అర్చన కుటుంబ సభ్యులకు రూ.35 వేలను అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ చనిపోయిన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్ల నుంచి ఇస్తున్న లక్ష రూపాయల సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచాలన్నారు. జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు జారీ చేసి ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఫాదర్స్‌డే సందర్భంగా శ్రీజకు సన్మానం

చిక్కడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటి శ్రీజ సాధినేనిని ఫాదర్స్ డే సందర్భంగా మంగళవారం రాష్ట్రపతి నిలయంలో నిలయం నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీజ సాధినేని దర్శకత్వంలో నాన్నకు ప్రేమతో నాటికను తన శిష్యులతో రంజకంగా ప్రదర్శించారు. ఈసందర్భంగా శ్రీజ మాట్లాడుతూ తన తండ్రి సాధినేని నాగేశ్వరరావు ప్రోత్సాహంతో హరికథ, బుర్రకథ, సంగీతం, నాట్యం వంటి విభాగాల్లో ప్రవేశం పొందానన్నారు.

'రేబిస్'తో వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రేబిస్ చికిత్సల కోసం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి వచ్చిన ఓ వ్యక్తి మృతిచెందాడు. గుడివాడకు చెందిన రాము(36) జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి పార్శిగుట్టలో నివాసం ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం గుడివాడకు వెళ్లిన అతను వీధి కుక్క దాడిలో గాయపడ్డాడు. ఆ సమయంలో అతను పూర్తిస్థాయిలో చికిత్సలు తీసుకోలేదు. పైగా మద్యం తాగాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన అతన్ని కుటుంబసభ్యులు సోమవారం ఉదయం ఫీవర్ ఆస్పత్రికి తరలించారు. రేబిస్ లక్షణాలు ఉండడంతో అతన్ని రేబిస్ వార్డులో చేర్చుకుని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. అతను చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ప్రయాణికుడి బ్యాగులో నుంచి ఆభరణాల చోరీ

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికుడి బ్యాగులో ఉన్న 11 తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారు. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ సీఐ ఎల్లప్ప కథనం ప్రకారం.. నగరంలోని రామకృష్ణ పురానికి చెందిన బీఎన్ నరసింహ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 14న బెంగళూరు వెళ్లారు. అయితే వెల్లంకి రైల్వేస్టేషన్‌లో దిగిన తర్వాత బ్యాగును చూసుకుంటే అందులో ఉన్న 11 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో మంగళవారం నగరానికి వచ్చిన నరసింహ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం వెల్లంకి రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ప్రయాణికుడి సెల్‌ఫోన్ చోరీ

రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి సెల్‌ఫోన్లను అపహరించిన దొంగలు అతడి బ్యాంక్ అకౌంట్లో ఉన్న నగదును డ్రా చేశారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన గోవిందరాజు దుండిగల్ రైల్వేస్టేషన్‌లో మధురై-కాచిగూడ రైలు ఎక్కిన తర్వాత ఆయన సెల్‌ఫోన్లు దొంగలు ఎత్తుకెళ్లారు. కాగా, ఇంటికి వెళ్లిన తర్వాత బ్యాంకుకు వెళ్లగా అకౌంట్లో డబ్బులు లేవని చెప్పారు. సెల్‌ఫోన్ దొంగలించిన దొంగలు ఫోన్‌పే ద్వారా రూ.41,000ను తస్కరించారు. దీనిపై మంగళవారం గోవిందరాజు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యలకు నిలయాలుగా విద్యా సంస్థలు: పీఎస్‌యూ

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించడం లేదు. దీంతో విద్యాసంస్థలు సమస్యలకు నిలయాలుగా మారాయని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కోట ఆనందరావు, ఉపాధ్యక్షుడు ఎన్.రాజశేఖర్, పి.ప్రశాంత్, శ్రీధర్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పీఎస్‌యూ రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యేడాది ప్రభుత్వ విద్యా సంస్థలు, హస్టల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతులు భర్తీ చేయలేదన్నారు.